ప్రజాశక్తి

సోమవారం 2 జనవరి 2023

పార్వతీపురం మన్యం

'స్వాతంత్ర్యోద్యమంలో ఆదివాసీలు' అంశంపై 4న సదస్సు

గుమ్మలక్ష్మీపురం: దేశ స్వాతంత్ర్య సమపార్జనలో ఎంతోమంది గిరిజనులు జాతీయోద్యమంలో పాల్గొని పోరాటం చేశారు. వారి సాహసాలని, జీవితాన్ని ఎక్కడా పాఠ్యపుస్తకాల్లో ప్రచురించలేదు. వారి త్యాగాలను సమాజానికి తెలియ చేయాల్సిన బాధ్యత ఈ తరంపై ఉందని, ఈ విషయాలను చర్చించేందుకు ఈనెల 4న స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణంలో సదస్సును నిర్వహిస్తున్నామని ట్రైబల్ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు ఆర్.లోవరాజు తెలిపారు. ఈ సందర్భంగా గుమ్మలక్ష్మీపురంలో కరపత్రాలు విడుదల చేశారు. ఆదివాసీ సమరయోధుల జీవితాలు, పోరాటాలు, సాహసాలు, దేశభక్తి వంటి విషయాలపై చర్చించాలన్న ఉద్దేశంతో సదస్సు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. సదస్సులో విశ్వవిద్యాలయ ఆచార్యులు, ఆదివాసీ మేధావులు, విద్యావంతులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గిరిజన సంఘ నాయకులు పాల్గొంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఇంటికొప్పల రామకృష్ణ, ట్రైబల్ పొలిటికల్ రైట్స్ జిల్లా అధ్యక్షులు తాడంగి లోకనాథం, ఫోరం జిల్లా గౌరవ అధ్యక్షులు ఆరిక గంగారావు ఉన్నారు.

ఉపాధి శిక్షణ ఎప్పుడో?

- ఎదురుచూస్తున్న గిరిజన యువత
- ప్రశ్నార్థకంగా వైటిసిల మనుగడ
- రెండేళ్లుగా జీతాలకు నోచుకోని సిబ్బంది
- పండగ పూటా పస్తులే
- డిప్యూటీ సిఎం ఇలాకాలోనూ అదే దుస్థితి

ప్రజాశక్తి - సాలూరు

గిరిజన యువతకు ఉపాధి శిక్షణ లిచ్చి ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన యువజన శిక్షణాకేంద్రాలు నేడు బోసిపోతున్నాయి. ఎలాంటి శిక్షణ కార్యక్రమాలు లేకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వైటిసిలు వెలవెలబోతున్నాయి. 2015లో టిడిపి ప్రభుత్వం పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలతో వైటిసిల నిర్మాణం చేపట్టింది. టిడిపి ప్రభుత్వం వున్నంత కాలం గిరిజన యువతీ యువకులకు ఉపాధి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. అదే సమయంలో సాలూరు, గుమ్మలక్ష్మీపురం వైటిసిల్లో గిరిజన గర్భిణులకు వసతి గృహాలు కూడా ఏర్పాటు చేశారు. వైటిసి ఏర్పాటు వెనుక ప్రధాన ఉద్దేశం గిరిజన నిరుద్యోగ యువతకు ఉపాధి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి ప్రయివేటు కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యేలా చేయడమే. అయితే గత ప్రభుత్వం హయాంలో ఈ కార్యక్రమాలు యధావిధిగా జరిగాయి. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైటిసిల నిర్వహణకు నిధులు మంజూరు పూర్తిగా నిలిచిపోయింది. గత రెండేళ్లుగా కరోనా వైరస్ విజృంభన, లాక్డౌన్ అమలుతో శిక్షణ కార్యక్రమాలు నిలిపివేశారు. కానీ ఏడాది కాలంగా ప్రభుత్వ, ప్రయివేటు కార్యకలాపాలు, విద్యాసంస్థల కార్యకలాపాలు జరుగుతున్నాయి. గడచిన మూడేళ్లుగా గిరిజన యువతకు ఉపాధి శిక్షణ కార్యక్రమాలు లేకపోవడంతో వారు బతుకు తెరువు కోసం ఇతర రాష్ట్రాలకు వలసలు పోతున్నారు. గిరిజన ప్రాంతంలో పదోతరగతి, ఇంటర్ చదువుకొని మధ్యలో చదువు ఆపేసిన యువతీయువకులు ఎక్కువగా ఉన్నారు. వీరికి ఏ విధమైన ఉపాధి అవకాశాలు లేకపోవడంతో వారి పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది.

రెండేళ్లుగా జీతాల్లేని సిబ్బంది

రాష్ట్ర వ్యాప్తంగా 17 వైటిసిలున్నాయి. పార్వతీపురం మన్యం జిల్లాలో సీతంపేట, గుమ్మలక్ష్మీపురం, సాలూరులో వైటిసిలు ఏర్పాటు చేశారు. ఒక్కో వైటిసిలో తొమ్మిది మంది సిబ్బంది పనిచేస్తున్నారు. హౌస్ కీపింగ్, సెక్యూరిటీ, గార్డెనింగ్ విభాగంలో ఏడుగురు, మేట్రిన్, మేనేజర్లు పని చేస్తున్నారు. గత రెండేళ్లుగా వీరికి జీతాలు అందడం లేదు. దీంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోతున్నారు. కుటుంబ పోషణ కోసం అప్పులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇక్కడ పనిచేస్తున్న కింద స్థాయి ఉద్యోగులంతా రెండు నుంచి మూడు లక్షల వరకు లంచాలు ఇచ్చుకుని ఉద్యోగాలు సంపాదించారు. మేనేజర్‌కు 14నెలలు, కింద స్థాయి సిబ్బందికి రెండేళ్ల పాటు జీతాలు అందలేదు. పండుగల పూట కూడా జీతాలు అందని పరిస్థితి నెలకొంది. క్రిస్మస్, సంక్రాంతి పండుగలకు కూడా జీతాలు అందకపోవడంతో వారు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

డిప్యూటీ సిఎం ఇలాకాలో దుస్థితి

డిప్యూటీ సిఎం రాజన్నదొర ఇలాకాలో ఉన్న వైటిసి సిబ్బందికి రెండేళ్లుగా జీతాలు అందని పరిస్థితి ఏర్పడింది. గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా ఉన్న రాజన్నదొర ప్రశ్నార్థకంగా మారిన వైటిసిల మనుగడపై దృష్టి సారించాలని గిరిజన యువకులు కోరుతున్నారు. గిరిజన యువత భవిత కోసం ఏర్పాటు చేసిన వైటిసిలను నిర్వీర్యం చేయడంపై అసంతృప్తి వ్యక్తమవుతోంది. గతంలో గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా పనిచేసిన పుష్పశ్రీవాణి గుమ్మలక్ష్మీపురం వైటిసిలో గిరిజన యువత శిక్షణ కార్యక్రమాల కోసం ట్రైకార్ నుంచి రూ.2కోట్లు వరకు ప్రత్యేక నిధులు మంజూరు చేయించారు. ఇప్పుడు కూడా మంత్రి రాజన్నదొర వైటిసి మనుగడపై దృష్టి సారించాలని గిరిజన సంఘాలు కోరుతున్నాయి.

వైటిసిలో ఉన్న గర్భిణులు

గర్భిణుల వసతి గృహాల నిర్వహణ

సాలూరు, గుమ్మలక్ష్మీపురంలోని గిరిశిఖర గర్భిణుల వసతి గృహాలున్నాయి. వీటి నిర్వహణకు సంబంధించి వైద్య సేవలందిస్తున్న సిబ్బందికి జీతాలు అందిస్తున్నారు. వైటిసి నిర్వహణలో భాగంగా ఉన్న గిరిజన గర్భిణుల వసతి గృహం నిర్వహణ కూడా వైటిసి సిబ్బంది చూస్తున్నారు. వసతి గృహంలో గిరి శిఖర గ్రామాలకు చెందిన గర్భిణులు ఉంటున్నారు. ఈ వసతి గృహం నిర్వహణ బాధ్యతలను నీడ్ స్వచ్ఛంద సంస్థ నిర్వహిస్తోంది.

పింఛను మంజూరు పత్రాలను పంపిణీ చేస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ

పథకాలకు అర్హతే ప్రామాణికం

పింఛన్ల పంపిణీలో మంత్రి బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి-చీపురుపల్లి

అర్హతే ప్రామాణికంగా పింఛన్లు, ఇతర సంక్షేమ పథకాలను అందిస్తున్నామని విద్యా శాఖా మంత్రి బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు. చీపురుపల్లి ప్రభుత్వ బాలుర జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ఆదివారం ఏర్పాటుచేసిన వైఎస్ఆర్ పింఛను కానుక కార్యక్రమానికి మంత్రి బొత్సతోపాటు జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, కలెక్టర్ సూర్యకుమారి హాజరయ్యారు. కొత్త పింఛనుదారులకు పింఛను మంజూరు పత్రాలు, హౌసింగ్ పట్టాలను మంత్రి అందజేశారు. అనంతరం మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ ముందుగా ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లాలో 9 వేల పింఛన్లు కొత్తగా మంజూరయ్యాయని చెప్పారు. అర్హత ఉన్న ప్రతి పేదవాడికి కూడా తప్పనిసరిగా పింఛను వచ్చేలా పనిచేస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వంలో ప్రతి నెలా ఒకటో తేదీన ఇంటికి వచ్చి పింఛను ఇచ్చే రోజులు ఉన్నాయా? అని ప్రజలను మంత్రి అడిగారు. గత ప్రభుత్వంలో పింఛన్ కావాలన్నా, ఒక రేషన్ కార్డు రావాలన్నా లంచం ఇస్తే గాని పని జరిగేది కాదన్నారు. అలాంటిది వైసిపి ప్రభుత్వం వచ్చాక సంక్షేమ పథకాలు, పింఛన్లు, రేషన్ కార్డులు వంటివి ఏవైనా లంచాలకు, అవినీతికి తావు లేకుండా అందజేస్తున్నారని పేర్కొన్నారు.

జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ చీపురుపల్లి నియోజకవర్గంలో కొత్తగా 1250 పింఛన్లు మంజూరైనట్లు తెలిపారు. రైతు పండించే ధాన్యాన్ని ప్రభుత్వమే స్వయంగా రైతుల దగ్గర కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. కష్టకాలంలోనూ సంక్షేమ కార్యక్రమాలు ఆపకుండా యథావిధిగా కొనసాగిస్తున్నామని తెలిపారు. విజయనగరం జిల్లాలో 8,999 మంది నూతన పింఛనుదారులకు ఈ నెల నుంచి పింఛన్ల పంపిణీ చేపడుతున్నట్లు డిఆర్‌డిఎ పీడీ కళ్యాణ్ చక్రవర్తి వెల్లడించారు. కార్యక్రమంలో కలెక్టర్ సూర్యకుమారి, బొత్స సందీప్, వైసిపి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

పాలకొండ మెయిన్ బజార్

తనిఖీలేవీ..?

వినియోగదారులకు తప్పని మోసాలు

ప్రజాశక్తి-పాలకొండ/పాలకొండ రూరల్:

తూనికలు, కొలతలు శాఖాధికారుల జాడే కరువైంది. దీంతో డివిజన్ కేంద్రమైన పాలకొండలో వినియోగదారులు మోసాలకు గురవుతూనే ఉంటున్నారు. పట్టించుకోవాల్సిన ఆ శాఖాధికారులు జాడ కనిపించకపోవడంతో వినియోగదారులను వ్యాపారులు మోసాలకు గురిచేస్తున్నారు. పట్టణంతో పాటు గ్రామాల్లో కూడా ఇదే పరిస్థితి కనిపిస్తుంది. అసలే పండగ సీజన్ కావడంతో మోసాలు మరింత ఎక్కువయ్యాయి. అసలు ఈ శాఖాధికారులు ఉన్నారా లేదా అన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

మండలంలో దాదాపు 3వేలు వరకు వాణిజ్య దుకాణాలున్నాయి. అందులో 1500 వరకు లక్షల్లో వ్యాపారాలు జరిగేవే. అయితే వీరంతా నిబంధనలకు పాతర వేస్తూ ఇష్టారాజ్యంగా వ్యాపారం చేస్తున్నా పట్టించుకునే నాథుడే లేడు. ప్రధానంగా తూనికలు, కొలతల్లో మోసం జరుగుతోంది. చికెన్ సెంటర్లు, కిరాణాషాపులు, కూరగాయల షాపుల్లో తీవ్రంగా మోసాలు జరుగుతున్నాయి. కేజీకి సుమారు 200 గ్రాములు తక్కువగా విక్రయిస్తున్నారు. దీంతో చేసేదేమీ లేక వినియోగదారులు కొనుగోలు చేస్తున్నారు. అయితే తూనికలు, కొలతలు అధికారులు దీనిపై దృష్టి పెట్టిన దాఖలాల్లేవు. అలాగే బట్టల దుకాణాల్లో ఘరానా మోసాలు జరుగుతున్నాయి. బ్రాండెడ్ బట్టల పేరుతో విక్రయిస్తూ ఎంఆర్‌పి ధరలు వ్యాపారులే నిర్ణయిస్తున్నారు. సొంతంగా స్టిక్కర్లు తయారు చేసి బట్టలకు అంటించి వేలాది రూపాయలు వినియోగదారుల నుంచి గుంజుతున్నారు. దీనిపై కూడా అడిగే నాథుడే లేడు. ఇంత జరుగుతున్నా ఆ శాఖాధికారులు ఎక్కడున్నారో తెలియడం లేదు.

వస్తామంటే షాపులు మూసివేత....

తూనికలు, కొలతలు శాఖాధికారులు వచ్చి దాడులు చేస్తారన్న రోజు పట్టణంలో ప్రధాన మార్కెట్‌లో షాపులను వ్యాపారులు మూసివేస్తున్నారు. ముందస్తు సమాచారం ఆ శాఖాధికారులే అందిస్తున్నట్టు తెలుస్తోంది. తూతూ మంత్రంగా దాడులు చేసి చేతులు దులుపుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పూర్తిస్థాయిలో దృష్టిపెట్టి ఆకస్మిక దాడులు చేపట్టి అక్రమాలకు చెక్‌పెట్టడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో వ్యాపారులు ఆడిందే ఆట పాడిందే పాటగా సాగుతుంది.

సమావేశాలేవి.....

ప్రతి మూడు నెలలకు ఆర్‌డిఒ అధ్యక్షతన నియోజకవర్గ స్థాయిలో వినియోగదారుల ఫోరం సమావేశాలు నిర్వహించాల్సి ఉంది. ఆర్‌డిఒతో పాటు నియోజకవర్గ పరిధిలో తహశీల్దార్లు, ఎంపిడిఒలు, తూనికలు, కొలతల శాఖాధికారులు, ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు, ఎక్సైజ్‌శాఖాధికారులతో పాటు వ్యాపారులు, గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు హాజరుకావాల్సి ఉంది. అయితే దాదాపు రెండేళ్ల నుంచి అటువంటి సమావేశాలే జరగడం లేదు. అసలు ఈ కమిటీ ఉన్నట్టు కూడా తెలియడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

ప్రజాశక్తి - సాలూరు

2022 సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ కొత్త సంవత్సరాన్ని స్వాగతిస్తూ ఆదివారం జిల్లాలో ఘనంగా నూతన సంవత్సర వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, అధికారుల నివాసాలకు అభిమానులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు పెద్దఎత్తున విచ్చేయడంతో అక్కడ కోలాహలంగా మారింది. కలెక్టరేట్‌లో కలెక్టర్ నిశాంత్‌కుమార్ కేక్ కట్‌చేసి అధికారులకు నూతన సంవత్సర శుభాంక్షలు తెలిపారు. అలాగే జిల్లా ఉన్నతాధికారులంతా కలెక్టర్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

సాలూరులో డిప్యూటీ సిఎం రాజన్నదొర నివాసం మన్యం జిల్లా అధికారులు, రాజకీయ ప్రముఖులతో సందడిగా కనిపించింది. నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల నుంచి పెద్ద ఎత్తున ఎంపిపి, జడ్పీటీసీలు, స్థానిక ప్రజాప్రతినిధులు, మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ, వైస్ చైర్మన్లు వంగపండు అప్పలనాయుడు, జర్జాపు దీప్తి, అర్బన్ బ్యాంక్ అధ్యక్షులు జర్జాపు ఈశ్వరరావు, పట్టణ అధ్యక్షులు జర్జాపు సూరిబాబు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గొర్లి జగన్మోహన్ రావు కౌన్సిలర్లు గిరిరఘు, రాపాక మాధవరావు,గొర్లి వెంకటరమణ, శ్యామలాంబ కో-ఆపరేటివ్ స్టోర్స్ చైర్మన్ మేడిశెట్టి అప్పలనాయుడు, వైసిపి నాయకులు, కార్యకర్తలు అభిమానులు క్యూలైన్లలో నిలబడి శుభాకాంక్షలు చెప్పారు. మక్కువ మండలం జెడ్పీటీసీ మావుడి శ్రీనివాసరావు నాయుడు, సీనియర్ నాయకులు రంగునాయుడు, దండి శ్రీనివాసరావు, వైస్ ఎంపిపి రెడ్డి సురేష్ శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు చెప్పడానికి వచ్చేవారు పూలబొకేలకు బదులుగా నోట్ పుస్తకాలు, పెన్నులు తీసుకురావాలని ఆయన పిలుపునిచ్చారు. దీంతో చాలామంది అధికారులు ప్రజాప్రతినిధులు నోట్ పుస్తకాలు తీసుకొచ్చారు. టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి జి.సంధ్యారాణి, మాజీ ఎమ్మెల్యే ఆర్పీ భంజ్ దేవ్ నివాసాలు పార్టీ నాయకులు, కార్యకర్తలతో

ప్రముఖుల నివాసాల్లో కోలాహలం

సందడిగా కనిపించింది. మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ, వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు జర్జాపు దీప్తి, అర్బన్ బ్యాంక్ అధ్యక్షుడు జర్జాపు ఈశ్వరరావు నివాసాల్లోనూ పట్టణ పార్టీ నాయకులు కార్యకర్తలు, అధికారుల కోలాహలం కనిపించింది.

నియోజకవర్గాన్ని జిల్లాలో ప్రథమస్థానంలో నిలపడమే ధ్యేయం

పార్వతీపురంరూరల్: నియోజకవర్గాన్ని జిల్లాలో ప్రథమ స్థానంలో ఉండేలా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా కొత్త ఏడాదిలో పనిచేస్తానని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. మండలంలోని నూతన సంవత్సర వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. నియోజకవర్గానికి చెందిన నాయకులు, కార్యకర్తలు, వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, జెడ్‌పిటిసి సభ్యులు, వివిధ కార్పొరేషన్ల సభ్యులు, ఎఎంసి చైర్మన్, కమిటీ సభ్యులు, పోలీసులు ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలియజేయడానికి పోటీపడ్డారు.

అలాగే టిడిపి మాజీ ఎమ్మెల్సీ, రాష్ట్ర అధికార ప్రతినిధి ద్వారపురెడ్డి జగదీష్ ఆధ్వర్యంలో టిడిపి కార్యాలయంలో న్యూఇయర్ వేడుకలు నిర్వహించగా, జిల్లా ఆసుపత్రి సూరిండెంట్ వాగ్దేవికి ఆసుపత్రి సిబ్బంది, వైద్యులు శుభాకాంక్షలు తెలిపారు. ఎంపిడిఒ, తహశీల్దారు కార్యాలయాలకు కార్యదర్శులు, విఆర్‌ఒలు, మండల అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.

సీతంపేట : నూతన సంవత్సర వేడుకలు స్థానిక ఐటిడిఎ పిఒ ఛాంబర్ల ఆదివారం పిఒ బి.నవ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తొలుత పిఒ కేక్ కట్ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. పలుశాఖల అధికారులు పిఒకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అధికారులతో కలుపుకొని ఐటిఎడి సమగ్ర అభివృద్ధికి ముందుకు తీసుకువెళ్తామన్నారు. కార్యక్రమంలో ఐటిడిఎస్ స్పోర్ట్స్ ఇంచార్జ్ జాకబ్ దయానంద్, డిపిఒ సతీష్ కుమార్, త్రినాధరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కేక్ తినిపిస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

సీతానగరం : మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి బి.రమణమ్మ, జెడ్‌పిటిసిసభ్యులు మామిడి బాబ్జికి ఎంపిడిఒ బి.కృష్ణమహేశ్ రెడ్డి, ఎఒ ఎంఎస్ఎన్ ప్రసాద్, ఇఒపిఆర్‌డి కెకె వర్మ, ఎపిఒ జి.నాగలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు అలాగే తహశీల్దార్ ఎంవి రమణకు గ్రామ రెవెన్యూ కార్యదర్శులు, ఎస్సై కె.నీలకంఠంకు సిబ్బంది,. ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘం నాయకులు ఎంఇఒ బి.సూరిదేముడు, ఎంపిపి రమణమ్మకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

వీరఘట్టం మండలంలోని ఆదివారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు . ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెలే వి కళావతి, టిడిపి పాలకొండ నియోజకవర్గ ఇన్చార్జి నిమ్మక జయకృష్ణ, ఎంపిపి డి.వెంకటరమణ నాయుడు, జెడ్‌పిటిసి సభ్యులు జంపు కన్నతల్లి ఉమామహేశ్వరరావును అధికారులు, అనధికారులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.

నూతన సంవత్సర వేడుకల్లో కలెక్టర్ నిశాంత్‌కుమార్, ఉన్నతాధికారులు

ఎమ్మెల్యే జోగారావుకు అభినందనలు తెలుపుతున్న ఎంపిడిఒ, సిబ్బంది

కేక్ కట్ చేస్తున్న సీతంపేట ఐటిడిఎ పిఒ నవ్య

యుటిఎఫ్ కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఆదివారం యుటిఎఫ్ కేలండర్‌ను యుటిఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు వి.శ్రీనివాసరావు, బి.ప్రసాద్, బి.రామకృష్ణ, మధుసూదనరావు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం పోరాటం కొనసాగిస్తూనే యుటిఎఫ్ పనిచేస్తుందని ఉపాధ్యాయుల కోసం మెరుగైన సమాచారం అందించేందుకు ఈ కేలండర్ ఎంత ఉపయోగపడుతుందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, శ్రీనివాసరావు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సీతానగరంలో కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

గుమ్మలక్ష్మీపురంలో కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఇఒ నారాయణరావు

గుమ్మలక్ష్మీపురం : నూతన సంవత్సరం సందర్భంగా స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో ఆదివారం యుటిఎఫ్ క్యాలెండర్‌ను ఎంఇఒ జె.నారాయణస్వామి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి కూర్మారావు, మండల ప్రధాన కార్యదర్శి పి ప్రసాద్ రావు, అధ్యక్షులు భాస్కరరావు, గౌరవ అధ్యక్షులు ఎం చలపతిరావు తదితరులు ఉన్నారు.

వీరఘట్టం : మండలంలోని వండువలో ఆదివారం స్థానిక ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి రాష్ట్ర ఉపాధ్యాయ పండితుపరిషత్తు క్యాలెండర్ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వి.మహేష్ , వై.రాజు, తవిటయ్య తదితరులు పాల్గొన్నారు.

స్థానికంగా ఉండం...హెచ్‌ఆర్‌ఎ కావాలి

ఇదీ ఏరియా ఆస్పత్రి వైద్యాధికారుల తీరు

ప్రజాశక్తి-పాలకొండ/పాలకొండ రూరల్

ప్రజలకు అందుబాటులో ఉండి వైద్యసేవలందించాల్సిన వైద్యాధికారులు స్థానికంగా ఉండరు. హెచ్‌ఆర్‌ఎ మాత్రం కావాలి. బేసిక్ వేల్యూమీద 15శాతం హెఆర్‌ఎ డ్రా చేసుకుంటూ స్థానికంగా ఉండకుండా రాకపోకలు చేస్తున్న వైద్యాధికారుల సంఖ్య కోకొల్లలే. డివిజన్ కేంద్రమైన స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో పనిచేస్తున్న వైద్యుల పరిస్థితి ఇది. ఏజెన్సీకి ముఖద్వారంగా ఉండి పాలకొండతో పాటు వీరఘట్టం, భామిని, శ్రీకాకుళం జిల్లా పరిధిలో ఉన్న బూర్జ, విజయనగరం పరిధిలో ఉన్న రేగిడి మండలాలలకు ఈ ఆస్పత్రే పెద్దదిక్కు. రోజుకు సుమారు 200పైగా ఒపి, 60పైగా ఇన్‌పేషెంట్లు ఉంటున్నట్టు ఆస్పత్రి రికార్డుల ద్వారా తేటతెల్లమవుతుంది. అయితే వైద్యాధికారులు మాత్రం అందుబాటులో ఉండకపోవడంతో రోగులకు అరకొరగానే సేవలందుతున్నాయి. ఇద్దరు గైనికాలజిస్టులు విజయనగరం నుంచి రాకపోకలు సాగిస్తుండగా ఆర్థో, చర్మవ్యాధి నిపుణులు, జనరల్ సర్జన్‌తో పాటు చెవి, ముక్కు, గొంతు నిపుణులు శ్రీకాకుళం నుంచే రాకపోకలు సాగిస్తున్నారు.. సకాలంలో వైద్యులు అందుబాటులో ఉండకపోవడంతో అరకొర సేవలే రోగులకు అందుతుండడం పట్ల సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

పాలకొండ ఏరియా ఆస్పత్రి

ప్రజాశక్తి
www.prajasakti.com



పేదలకు బియ్యం ప్యాకెట్లు అందజేస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

పేదలకు బియ్యం పంపిణీ

సాలూరు : పట్టణంలోని నిరుపేదలకు నూతన సంవత్సరం సందర్భంగా డిప్యూటీ సిఎం రాజన్నదొర చేతులు మీదుగా బియ్యం పాకెట్లను ఆదివారం పంపిణీ చేశారు. స్థానిక రామానుజన్ మేథ్స్ క్లబ్ వ్యవస్థాపకులు డాక్టర్ రంభ రజనీకాంత్, లయన్స్ క్లబ్ డైమండ్స్ జోనల్ చైర్మన్ కొల్లి గిరిబాబు, డైరెక్టర్ కెవి సత్యనారాయణ సహకారంతో 23మంది పేదలకు బియ్యం పంపిణీ చేశారు. తన వద్దకు కొత్త సంవత్సరం సందర్భంగా పూలబొకేలు తీసుకురావొద్దని, పేదలకు ఉపయోగపడే కార్యక్రమం చేపట్టిటాలని రాజన్నదొర కోరడంతో రజనీకాంత్ పేదలకు బియ్యం పంపిణీ కార్యక్రమం చేపట్టారు. పట్టణంలోని బంగారమ్మపేట, గ్యాస్ ఏజెన్సీకు వెళ్లే రహదారి పక్కన ఉన్న నిరుపేదలకు బియ్యం పాకెట్లను అందజేశారు. కార్యక్రమంలో శ్రీ సత్యసాయి జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సిహెచ్.ప్రసాద్ వున్నారు.



ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్‌కు ఆయన ఫొటోను అందజేస్తున్న డ్రాయింగ్ టీచర్ శ్రీనివాసరావు

రుగడను అభినందించిన పిఒ

జియ్యమ్మవలస : మండలంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల రావాడ రామభద్రపురం డ్రాయింగ్ ఉపాధ్యాయులు రగడ శ్రీనివాసరావు పార్వతీపురం ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి విష్ణుచరణ్‌కు పిఒ చిత్రపటాన్ని తన చేతులతో వేసి ఆయనకు అందజేశారు. నూతన సంవత్సరం సందర్భంగా ఆదివారం పిఒ కార్యాలయంలో డిఇఒతో పాటు శ్రీనివాసరావు వెళ్లి చిత్రపటాన్ని అందించారు. ఈ సందర్భంగా పిఒ విష్ణు చరణ్ శ్రీనివాసరావును అభినందిస్తూ తన సంతోషాన్ని వ్యక్తం చేశారు.

బాధితుడికి చెక్కును అందజేస్తున్న సర్పంచి, ఎంపిటిసి సభ్యులు

టిబి వ్యాధిగ్రస్తుడికి ఆర్థికసాయం

బలిజిపేట : మండలంలోని పెదపెంకి టిబి వ్యాధిగస్తుడికి ఆర్థిక వితరణను అందజేశారు. పెదపెంకిలో నిరుపేద ఎస్.కురమయ్య టిబితో బాధపడుతున్నాడు. ఈ విషయమై నేతాజీ గ్రంథాలయం వ్యవస్థాపకులు ఈర్ల సంజీవనాయుడు దాతల నుండి సేకరించిన రూ.10700 ను సర్పంచ్ ఎస్.పాపారావు, ఎంపిటిసి జి.సునీత చేతులు మీదుగా సంజీవ నాయుడు ఆ పెదకుటుంబానికి అందజేశారు. ఈ విరాళం అందించే కార్యక్రమంలో జి.శ్రీనివాస్‌రావు, పెనుబోతు దుర్గా ప్రసాద్, ఎం.శ్రీను, కర్రి సతీష్ తదితర యువత పాల్గొన్నారు.

ఆర్‌పిలకు దుస్తులు అందజేస్తున్న టిడ్కో చైర్మన్ ప్రసన్నకుమార్

టిడ్కో కేలండర్ ఆవిష్కరణ

పార్వతీపురం టౌన్ : ఎపి టిడ్కో ముద్రించిన కేలండర్‌ను ఛైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్ ఆదివారం ఆవిష్కరించారు. టిడ్కో హౌసింగ్ ప్రాజెక్ట్ పై గతేడాది నుంచి జరిగిన అభివృద్ధిని, సంపన్నులు సైతం ఆశ్చర్యపడేలా ఆయా గృహ సముదాయాల్లో లబ్దిదారులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు మొదలగు అంశాలు ప్రజలకు తెలిపేలా వినూత్న పద్ధతిలో ఈ కేలండర్‌ను ముద్రించారు. నూతన సంవత్సరం సందర్భంగా లబ్ధిదారులు, ప్రాజెక్ట్ రిజిస్ట్రేషన్‌లో మున్సిపల్, మెప్మా ఆర్‌పిలు చేస్తున్న కృషికిగానూ దుస్తులను బహుమతిగా అందజేశారు. అనంతరం స్థానిక పార్టీ కార్యకర్తలకు నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్పటి వరకూ సుమారుగా 45వేల గృహాలను లబ్దిదారులకు అందించామని, రాబోయే మరో మూడు నెలల్లో మరో 50 వేల ఇళ్లను దశల వారీగా లబ్ధిదారులకు అందించేందుకు ప్రభుత్వ తగు కార్యాచరణ రూపొందించిందని తెలిపారు. కార్యక్రమంలో చుక్క లక్ష్మ నాయుడు, మండల పకీరు నాయుడు, తాడ్డి రమేష్, బోను రామినాయుడు పలువురు సర్పంచులు, ఎంపిటిసిసభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల నూతన కమిటీ ఎన్నిక

గుమ్మలక్ష్మీ పురం : సిఐటియు ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికసంఘం మండల నూతన కమిటీ ఆదివారం ఎన్నికైంది. మండల అధ్యక్షులుగా సర్వేపల్లి గౌరీశంకర్, ఉపాధ్యక్షులుగా కార్పెంటర్ శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా పాలక నారాయణ, సహాయ కార్యదర్శిగా మునుకోటి శ్రీను, కోశాధికారిగా తోయక కడియా మండంగి కోటేశ్వరరావు కమిటీలో ఎన్నుకోబడ్డారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.అవినాష్, జిల్లా కమిటీ సభ్యులు కె. గౌరీశ్వరరావు, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

కొత్తగా ఎన్నికైన సిఐటియు నూతన కార్యవర్గం

పింఛన్లతో ప్రతిఒక్కరికీ భరోసా

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లతో ప్రభుత్వం భరోసా ఇస్తుందని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఆదివారం స్థానిక మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిలుగా పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ రూ.2750కు పెన్షన్ పెంపుతో పాటు అదనంగా పట్టణంలో 5,375 పింఛన్లు ఇవ్వటమే కాకుండా ఈనెల నుంచి మరో 228 కొత్త పెన్షన్లను సైతం మంజూరు చేసి అర్హత ఉన్న ప్రతి లబ్ధిదారుడికి ఆసరాగా నిలవడమే తమ ప్రభుత్వం ధ్యేయం అన్నారు. అనంతరం ఎమ్మెల్యే స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి కొత్తగా మంజూరైన పెన్షన్లను లబ్ధిదారుకు అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు మున్సిపల్ చైర్పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్‌చైర్మన్లు కొండపల్లి రుక్మిణి, ఇండుపూరు గున్నేష్, మున్సిపల్ కమిషనర్ జె.రామఅప్పలనాయుడు, పార్టీ పట్టణ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, పార్టీ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, వార్డు ఇన్చార్జిలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

లబ్ధిదారునికి పింఛను హామీ పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

సీతానగరం, కురుపాంలో లబ్ధిదారులకు పింఛన్లు అందజేస్తున్న సర్పంచులు మహేష్, మన్మధరావు

సీతానగరం : మండలంలో వివిధ పంచాయతీల్లో కొత్తగా మంజూరైన పెన్షన్లు, పెంచిన పెన్షన్ల డబ్బులను ఆదివారం ఆయా గ్రామ సర్పంచులు వాలంటీర్ల ద్వారా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అంటిపేట సర్పంచ్ ఎస్.మహేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలో భాగంగా పింఛను రూ.2,750కు పెంచారని, అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ ఇవ్వడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి ఎ.కృష్ణంనాయుడు, బిసి కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

కురుపాం : నూతన సంవత్సర కానుకగా పింఛను పెంచడం హర్షించదగ్గ విషయమని నీలకంఠాపురం సర్పంచ్ ఎ.మన్మధరావు అన్నారు. కొత్తగా పెంచిన పింఛనను ఆదివారం ఆయన లబ్ధిదారులకు ఇంటికి వెళ్లి అందజేశారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలన్నీ కూడా నెరవేర్చుకుంటూ బడుగు, బలహీనవర్గాల ప్రజలను ఆదుకుంటున్నారని పేదల పక్షపాతి అని అన్నారు.

జనసేన పోస్టర్, కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- పార్వతీపురం

స్థానిక చర్చి వీధి జనసేన కార్యాలయంలో ఆదివారం మన యువత, మన భవిత పేరుతో యువశక్తి పోస్టర్‌ను, ఆ పార్టీ క్యాలెండర్ ను జనసేన రాష్ట్ర ప్రచార కార్యదర్శి పాలూరు బాబు, పార్వతీపురం నియోజకవర్గ నాయకులు అక్కివరపు మోహనరావు చేతుల మీదగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం హయాంలో కేలండర్లు ఎన్ని మారుతున్నా యువతకు మాత్రం ఉపాధి కల్పించకుండా నిరుద్యోగాన్ని పెంచి పోషిస్తున్నారన్నారు. పాలన మారాలంటే పవన్ రావాలన్నారు. పార్టీ సిద్ధాంతాలతో కూడిన కేలండర్ని నియోజకవర్గంలో యువతకు, ప్రజలకు అందరికీ చేరవేయాలని పిలుపునిచ్చారు. ఈనెల 12న చలో రణస్థలం కార్యక్రమానికి యువతను పెద్ద ఎత్తున కదిలించాలన్నారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు మణి, నాయకులు చెట్లు గణేష్, గుంట్రెడ్డి గౌరీ, పైల రాజు, మరియు జనసేన కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

సీతానగరం : ఈనెల 12న శ్రీకాకుళంలో యువశక్తి గర్జన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జనసేన పార్వతీపురం నియోజకవర్గ నాయకులు అక్కివరపు మోహనరావు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం గోడపత్రిక విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం నిరుద్యోగ సమస్యలను పట్టించుకోవడంలేదని, ఉద్యోగాలు ఇవ్వడం లేదని ఆరోపించారు. రోజురోజుకు సామాన్యులు తీవ్ర బాధలకు గురవుతున్నారని అన్నారు ఈ గర్జనకు రాష్ట్ర నాయకులు పవన్ కళ్యాణ్, నాదేండ్ల మనోహర్ హాజరవుతారన్నారు. కావున ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున యువత పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో జనసేన నాయకులు బాబు పాలూరి, సివి రమణ, శ్రీనివాసరావు, అల్లు రమేష్, శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

బలిజిపేట : ఈనెల 12న రణస్థలంలో జరగబోయే యువశక్తి మన యువత మన భవిత కార్యక్రమంపై జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు మండలంలోని జనసేన కార్యక్రమాల నిర్వహణ రాష్ట్ర ప్రచార కార్యదర్శి బాబు పాలూరు, పార్వతీపురం నియోజకవర్గ జనసేన సీనియర్ నాయకులు అక్కవరపు మోహనరావు శనివారం స్థానిక బస్టాండ్ వద్ద యువశక్తి కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మోహనరావు మాట్లాడుతూ గ్రామస్థాయిలో వాలంటీర్లను చౌక బేరంతో కొని వారిచేత వెట్టి చాకిరీని వైసిపి ప్రభుత్వం చేయించుకుంటుందని విమర్శించారు. యువత సమస్యలపై రణస్థలంలో జరగబోయే సమావేశానికి రాష్ట్ర నలుమూలల నుంచి యువత కదలి రావాలని, యువశక్తి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పాలూరు బాబు కోరారు. కార్యక్రమంలో జి.స్వామినాయుడు, వెంకటరమణ, యువత తదితరులు పాల్గొన్నారు

కేలండర్, యువగర్జన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జనసేన నాయకులు

న్యూఇయర్ వేడుకల్లో విషాదం

కబడ్డీలో గాయపడి యువకుడు మృతి

ప్రజాశక్తి- పూసపాటిరేగ

కబడ్డీ ఆటలో ప్రమాదవశాత్తు అదుపుతప్పి యువకుడు నేలపై పడటంతో మెడకు తీవ్రగాయాలై చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందారు. డిసెంబరు 31వతేదీ రాత్రి మండలంలోని వెంపడాం గ్రామంలో కబడ్డీ పోటీలు జరిగాయి. కొవ్వాడ, ఎరుకొండ జట్లు మధ్య కబడ్డీ హోరాభహోరీగా సాగుతోంది. ఈ నేపథ్యంలో కొవ్వాడ గ్రామానికి చెందిన యువకుడు కూతకు వెళ్లాడు. కూతకు వచ్చిన వ్యక్తిన పట్టుకొనే క్రమంలో ఎరుకొండకు చెందిన క్రీడాకారుడు అత్తి రమణ (18) అదుపుతప్పి నేలపై పడటంతో మెడ విరిగింది. చికిత్స నిమిత్తం విజయనగరం తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడ నుండి విశాఖ కెజిహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం యువకుడు మృతి చెందాడు. అనుకోని ప్రమాదంలో కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు శ్రీనువాసురావు, భూలక్ష్మిలు బోరున విలపించారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం విశాఖ కెజిహెచ్ మార్చురీకి తరలించారు. ఈ మేరకు పూసపాటిరేగ ఎస్ఐ నరేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజాప్రతినిధులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న పంచాయతీ కార్యదర్శులు

ప్రజాప్రతినిధులకు ఘన సన్మానం

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని సర్పంచులకు, ఎంపిటిసి, జెడ్పిటిసి సభ్యులకు, జెడ్పి కోఆప్షన్, మండల కో ఆప్షన్ సభ్యులకు నూతన సంవత్సర దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆదివారం పంచాయతీ కార్యదర్శుల మండల అధ్యక్షులు కె.చంద్రశేఖర ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సుపరిపాలన జరిగి ప్రజలకు సమస్యలు పరిష్కరించాలంటే ప్రజాప్రతిని కీలకమని, అటువంటిది ఈ నూతన సంవత్సర దినోత్సవ సందర్భంగా వారిని పంచాయతీ కార్యదర్శులు సన్మానించుకోవడం తమకు గర్వంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు వై.వెంకట నాయుడు, కె.అనురాధ, ప్రజా ప్రతినిధులు జిల్లా కోఆప్షన్ సభ్యులు షేక్ నిసార్, జడ్పిటిసి జి.సుజాత మేజర్ పంచాయతీ సర్పంచ్ జి.సుజాత ఉపసర్పంచ్ షేక్ ఆదిల్, మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ జిలాని, ఎఎంసి మాజీ చైర్మన్ ఎన్ వెంకట్రావు, 23 పంచాయితీల సర్పంచులు ఎంపీటీసీలు పాల్గొన్నారు.

హ్యాంగింగ్ బ్రిడ్జి వద్ద సందడి చేస్తున్న యువతులు

పార్కులో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్క్‌లో పర్యాటకులు సందడి చేశారు. ఆదివారం సెలవు రోజు కావడం, అందులో నూతన సంవత్సరం కావడంతో జిల్లా నలుమూల నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి కూడా పర్యాటకులు తరలివచ్చారు. పార్క్‌లో ఉన్న అందాలను ఆశ్వాదించారు. యువతీ యువకులు హ్యాంగింగ్ బ్రిడ్జిపై నడిచి వెళ్లారు. ఆనంద విహార వద్ద డాన్సులు వేశారు. జలవిహార్ వద్ద బోటుషికార్లు చేశారు. అనంతరం మెట్టగూడ జలపాతాన్ని సందర్శించారు.

86 మందికి కంటి పరీక్షలు

విజయనగరంటౌన్: నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అధ్యక్షులు మువ్వల గంగాప్రసాదరావు ఆధ్వర్యాన సంఘం కార్యాలయంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. ఈ శిబిరాన్ని ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు మురళి ప్రారంభించారు. శిబిరంలో 86 మందికి కుమారస్వామి కంటి ఆస్పత్రి వైద్యులు పరీక్షలు చేసి, 28 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. వీరికి ఉచితంగా శస్త్రచికిత్స చేయనున్నట్లు మేనేజర్ బాబ్జి తెలిపారు. ముందుగా సంఘం వ్యవస్థాపకులు వి.భద్రయ్య చిత్రపటం వద్ద నివాళు లర్పించారు. అనంతరం నూతన సంవత్సర కేలండర్ ఆవిష్కరించారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న నాలుగో తరగతి ఉద్యోగాలను పూర్తిస్థాయిలో భర్తీ చేయాలని అధ్యక్షులు మువ్వల గంగా ప్రసాదరావు ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో వై.ఆనంద్, పెన్షనర్ సంఘం జిల్లా కార్యదర్శి జి.నారాయణరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.శ్రీనివాసరావు, ఆల్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్‌సిహెచ్ రవి యాదవ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.శ్రీనివాసరావు, పట్టణ ఉపాధ్యక్షులు బి.పైడితల్లమ్మ, కార్యదర్శి గంగి రమేష్, కోశాధికారి జి.అప్పారావు, ఎం.మంగరాజు, బి.జయబాబు, చందక శ్రీనివాసరావు, పి.రామలక్ష్మి పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమ పథకాలు పునరుద్ధరించాలి

ప్రజాశక్తి - భామిని

మండలంలోని వివిధ రంగాల్లోని కార్మికులు స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సిఐటియు ఆధ్వర్యంలో నిరసన, ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా భామిని మండలం సిఐటియు అధ్యక్షులు ఎన్.అప్పలస్వామి మాట్లాడుతూ నిబంధనల పేరిట సంక్షేమ పథకాలు నిలిపివేయడం, తొలగించడం అన్యాయమన్నారు. ఇసుక కొరత సృష్టించి, పనులు లేక కార్మికులు దూర ప్రాంతాలకు పనుల కోసం వలస వెళ్తున్నారని, ప్రభుత్వం వెంటనే స్పందించి యధావిధిగా కార్మిక సంక్షేమ పథకాలు అమలుచేసి, వలసల నివారణకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం ఉపాధ్యక్షులు బీమాసింగి రామారావు, కార్యదర్శి గజపతిరావు, సిఐటియు జిల్లా కమిటీ కార్యదర్శి జి.ప్రసాదరావు, సిపిఎం మండల కార్యదర్శి జగన్నాయకులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న అప్పలస్వామి

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

ప్రజాశక్తి- బొబ్బిలి

నూతన సంవత్సర వేడుకలలో అపశృతి చోటు చేసుకుంది. వేడుకలు జరుపుకొని ఆదివారం తెల్లవారు జామున పెట్రోల్ కోసం ద్విచక్ర వాహనంపై పెట్రోల్ బంకుకు వెళ్తుండగా కారును ఢీకొనడంతో గొల్లపల్లి గ్రామానికి చెందిన యువకుడు గలగట్ల వాసు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదంలో మరో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. వాసు మరణంతో గొల్లపల్లిలో విషాదఛాయలు అలముకున్నాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదంలో గర్భిణికి గాయాలు

హాస్పిటల్‌లో చేర్చిన ఎంపిపి

ప్రజాశక్తి - భామిని

స్టాఫ్‌నర్స్‌గా విధులు నిర్వహిస్తున్న పాలకొండకు చెందిన జ్యోతి బగ్గమర్రిపాడు పిహెచ్‌సి నైట్ షిఫ్ట్ డ్యూటీకి వెళుతుండగా సీతంపేట సమీపంలో హడ్డుబంగి వద్ద గుర్తు తెలియని లారీ ఢీకొట్టింది. ఎంఎల్ఎ కళావతిని కలవడానికి వెళ్తున్న భామిని ఎంపిపి ప్రతినిధి తోట సింహాచలం గాయాలుతో ఇబ్బంది పడుతున్న ఆమెను రోడ్డు పక్కన గమనించి వెంటనే తన సొంత కారులో పాలకొండ ఆసుపత్రి తరలించారు. ప్రస్తుతం ఆమె 5 నెలలు గర్భవతి. అదే సమయంలో అదే మార్గంలో వెళ్తున్న భామిని మండలం వైస్ఎంపిపి ధర్మారావు, టింగ అన్నాజిరావు, జెడ్‌పిటిసి బొడ్డేపల్లి ప్రసాదరావు, శివ్వాల తిరుపతి, గేదల మోహన్ ఆమెకు సహకరించారు.

క్షతగాత్రులను కారులో ఆస్పత్రికి తరలిస్తున్న ప్రజాప్రతినిధులు

వెంకంపేటలో రహదారి నిర్మాణ పనులు

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

వెంకంపేట పంచాయితీలోని వసుంధరనగర్, వైకెఎం కాలనీలలో పలుచోట్ల సిసి రహదారుల నిర్మాణ పనులు సర్పంచ్ తీళ్ల కృష్ణారావు ఆధ్వర్యంలో అదివారం జరిగాయి. ఇన్నాళ్లకు తమ రహదారి సమస్యతీరునున్నదని స్థానికులు ఆనందం వ్యక్తం చేయగా, 15వ పైనాన్స్ నిధులతో పంచాయితీలో అవసరమైన చోట్లలో దశలవారీగా నిర్మాణా చేపడతామని ఈ సందర్భంగా సర్పంచ్ తెలియజేశారు.

రోడ్డు పనులను చేయిస్తున సర్పంచి కృష్ణారావు

పింఛన్లు పంపిణీ

విజయనగరంటౌన్ : రాష్ట్ర ప్రభుత్వం పెంచిన పింఛన్లను అందజేసే కార్యక్రమాన్ని ఆదివారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించారు. నూతనంగా 1,065 మంది లబ్ధిదారులకు పింఛన్లను మంజూరు చేశారు. అనంతరం మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ మాట తప్పని, మడమ తిప్పని నేతగా సిఎం జగన్ ప్రతి పథకాన్ని అవినీతి రహితంగా అందిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ ప్రసాదరావు, డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, రేవతిదేవి, కార్పొరేటర్లు గుజ్జల నారాయణరావు, కంటభుక్త తవిటి రాజు, కనకల నాగవల్లి, టిపిఆర్ఒ సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

ఎపిజిఇఎ కేలండర్ ఆవిష్కరణ

విజయనగరం: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఎపిజిఇఎ) నూతన కేలండర్‌ను జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యోగుల సహకారంతోనే జిల్లాను అభివృద్ధి పథంలో నడుపుతున్నామని తెలిపారు. నూతన సంవత్సరంలో ఇదే సహకారం కొనసాగాలని కోరారు.